క్లుప్తంగా

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

త్రిపురాంతకం: విద్యార్థులు, ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.అసాన్, ఎస్‌ఐ సీహెచ్ శివ బసవరాజు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు సైబర్ క్రైంపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉన్నందున విద్యపై దృష్టి పెట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో రకరకాల మోసాలు వెలుగు చూస్తున్నందున అనవసరమైన వాటి జోలికి వెళ్ల వద్దన్నారు. విద్యార్థులు ఫోన్ వినియోగం ద్వారా సైబర్ నేరగాళ్లకు దొరుకుతున్నారన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాలలో వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై పోలీసులు భారీగా జరిమానాలు విధించారు. శుక్రవారం మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్‌లో ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా తిరుగుతున్న వాహనాలను ఆయన పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేని 25 వాహనాలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి ఎన్నో కుటుంబాల్లో విషాదం నెలకొందన్నారు. ప్రైవేట్ వాహనదారులందరూ తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని, డ్రైవర్ల లైసెన్స్‌లు పరిశీలించి వారికి వాహనాలు ఇవ్వాలని యజమానులను ఆయన కోరారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడపటం నేరమన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

దర్శి: అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ అధికారి షేక్ రాబియా బేగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యువల్, నూతన ఉపకార వేతనాలకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాల్లో సంక్షేమ, విద్యా సహాయకుల లాగిన్లో ఫైవ్ స్టెప్ వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

వీఆర్వోపై ఆర్డీఓకు ఫిర్యాదు



వీఆర్వోపై ఆర్డీఓ కు ఫిర్యాదు చేస్తున్న రైతు

కురిచేడు: మండలంలోని పొట్లపాడు పంచాయతీ పరిధి మొండెద్దులపాలెం రైతు మొండెద్దు మహానందిరెడ్డి శుక్రవారం ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డికి వీఆర్వోపై ఫిర్యాదు చేశారు. ప్రస్తుత పడమరవీరాయపాలెం వీఆర్వో ఆంజనేయులు పొట్లపాడు వీఆర్వోగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో పట్టాదారు పాస్ పుస్తకం మంజూరుకు రూ.4500 నగదు తీసుకుని పట్టాదారుపాస్ పుస్తకం మంజూరు చేయలేదని ఆర్డీఓ ఎదుట చెప్పాడు. పట్టాదారుపాస్ పుస్తకానికి డబ్బు ఎందుకిచ్చావని ఆర్డీఓ సదరు రైతుపై మండిపడ్డారు. మీ సేవలో దరఖాస్తు చేసి తహసీల్దార్‌ని కలిస్తే సరిపోతుందని ఆయన పేర్కొన్నారు.

నేడు కాలభైరవునికి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీపార్వతి త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానంలోని కాలభైరవుని ఆలయంలో కార్తీక మాసం శనివారం ప్రత్యేక పూజలు, హోమం జరగనున్నట్లు ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఐవీ సుబ్బారావు తెలిపారు. త్రిపురాంతకంలోని కాలభైరవునికి ప్రత్యేక పూజల్లో భాగంగా హోమం, అభిషేకం, కూష్మాండ దీపోత్సవం పండితులు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

దర్శి: విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి సూచించారు. స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బంగారు బాల్యం కార్యక్రమం సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎస్కే రాబియా బేగం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రఘురామయ్య, రమాదేవిలు మాట్లాడుతూ ప్రస్తుత విద్యాభ్యాసంపై బాలికల అభిరుచి గురించి వివరించారు. విద్య, క్రీడల్లో ప్రస్తుత సవాళ్లు, పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు స్మార్ట్‌గా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహం సంక్షేమాధికారి డి.రజనీకుమారి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను కదిలిస్తే కన్నీరే

- వ్యాధులతో స్వచ్ఛత వారధుల సతమతం
- కనీస సామగ్రి ఇవ్వని పంచాయతీ అధికారులు
- లబోదిబోమంటున్న పారిశుధ్య కార్మికులు



పుల్లలచెరువులో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

పుల్లలచెరువు:

సూర్యోదయానికి ముందే చీపుర్లు, చెత్త డబ్బాలు పట్టుకుని వీధుల్లో ఉంటారు.. వేడుకలు, ప్రముఖుల పర్యటనలు అనగానే స్వచ్ఛతకు రాత్రింబవళ్లు శ్రమిస్తారు. అలాంటి పారిశుధ్య కార్మికులకు అందాల్సిన రక్షణ పరికరాలు గానీ, చర్మ వ్యాధులు ప్రబలకుండా నూనెలను గానీ అందించడం లేదు. దీంతో పంచాయతీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో 65 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారిని పలకరిస్తే పలు సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గ్రామాల్లో వీధుల్లో మురుగు, వ్యర్థాలను తొలగించే సమయంలో చేతులకు గ్లౌజులు ఉండవు, సూదులు, సీసాలు గుచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు మూడు చొప్పున చీరలు, తువాళ్లు, పాదరక్షలు, 4 కిలోల కొబ్బరి నూనె, 12 సబ్బులు, పురుషులకు రెండు జతల ఖాకీ దుస్తులు, రెండు తువాళ్లు, జత బూట్లు, సబ్బులు ఇవ్వాలి. పంచాయతీ కార్మికుల ఆరోగాన్ని దృష్టిలో ఉంచకుని పంచాయతీ వారు అన్నీ సమకూర్చాలని ఉన్నా ఎక్కడా అవి సమకూరుస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో కొందరు జ్వరాలు, రోగాల బారిన పడుతున్నారు. జ్వరాలు, చర్మ వ్యాధులు వస్తే పంచాయతీ వారు ఇచ్చే వేతనాల్లో సగం వాటికే ఖర్చు అవుతున్నాయని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉందని కార్మికులు కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కార్మికులు తమ సొంత డబ్బులు వెచ్చించి గ్లౌజులు కొంటున్నారు. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

> **కార్మికుల ఆరోగ్యం పట్టించుకోవాలి**
>
> 
>
> నిత్యం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి సౌకర్యాలు సమకూర్చకుంటే ఎలా. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటే ఎవరు వారిని ఆదుకోవాలి. చట్టంలో ఉన్న మౌలిక వసుతులు పంచాయతీ అధికారులు సమకూర్చాలి. దీనిపై అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.
>
> – జి.గురునాథం, సీపీఐ కార్యదర్శి, పుల్లలచెరువు

జన జాతీయ గ్రామ ఉత్కర్ అభియాన్‌పై గిరిజనులకు అవగాహన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న లాల్ అహ్మద్, గిరిజనులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చింతల, తుమ్మలబైలు గిరిజన గూడేల్లో శుక్రవారం దర్తి అభా జన జాతీయ గ్రామ ఉత్కర్ అభియాన్‌పై గిరిజనులకు శుక్రవారం అవగాహన కల్పించారు. డీటీబ్ల్యూఓ జగన్నాథరావు ఆదేశాల మేరకు సర్పంచ్ వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయా గూడేల్లోని గిరిజనులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాని హాజరైన ఎన్ఆర్‌జీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ లాల్ అహ్మద్ మాట్లాడుతూ ఈ పథకంలో నిర్దేశించిన గ్రామాల పరిధిలోని నివాస గృహాలకు తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, సౌష్టికాహారం, రోడ్లు వంటి సౌకర్యాలు అందించే లక్ష్యంతో 24 వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇందులో భాగంగా శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా గిరిజనలకు అవసరమైన ముఖ్య అవసరాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. శనివారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి వారి అవసరాలను గుర్తించి ఈ పథకం ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి నాగార్జునసింగ్, హెచ్‌ఎంలు కనకయ్య, సుధాకర్, రవీంద్ర, వెలుగు సీసీ మోహన్ రావు పాల్గొన్నారు.

లైవ్‌స్టాక్ 7వ వార్షికోత్సవం

దొనకొండ: స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం లైవ్‌స్టాక్ 7వ వార్షికోత్సవం నిర్వహించారు. సమావేశం ఏపీఎం జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకే కాకుండా మగవారికి కూడా గ్రూపులు ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లు, చేపల పెంపకం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నిర్వహించుకుంటే మంచి ఆదాయం వస్తుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పశు వైద్యాధికారి కరిష్మా మాట్లాడుతూ మగవారు కూడా గ్రూపులుగా ఏర్పడి గొర్రెలు, మేకలు సబ్సిడీపై పొందవచ్చన్నారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సరైన పద్ధతిలో ఉపయోగించుకుని తిరిగి కంతుల వారీగా చెల్లించాలన్నారు. పశువులకు, గొర్రెలు, మేకలకు ఆయా గ్రామాల్లో క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పల్లె మణీందర్‌దేవ్, ఉపాధ్యక్షుడు ముడమంచు పోలురాజు, సెక్రటరీ ముడమంచు కొండగురవయ్య, జాయింట్ సెక్రటరీ మురికిపూడి పోలయ్య, కోశాధికారి వినయ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి



అన్నాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కురిచేడు: స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగది, వంటలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వసతుల గురించి ఆరా తీశారు. 9వ తరగతి విద్యార్థి తమకు ట్యాబులు ఇవ్వలేదని ఆర్డీఓకు తెలపగా ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. అనంతర ం పాత్రికేయులతో మాట్లాడుతూ సాధారణ పరిశీలన మాత్రమేనని, పాఠశాలలో ఉన్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కలెక్టరుకు నివేదిక ఇస్తానని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, వీఆర్వో కేవీ నాగరాజు పాల్గొన్నారు.

పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



రైతుతో మాట్లాడుతున్న అంజయ్య

దొనకొండ: గ్రామాల్లో పత్తి సాగు చేసిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర క్వింటాకు రూ.8500 కల్పించి ఆదుకోవాలని మండల రైతు సంఘ నాయకులు చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని దొండపాడు, ఆరవల్లిపాడు, వెంకటాపురం గ్రామాల్లోని పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. దొండపాటి కేశమ్మ, కంభంపాటి హనుమంతు, సుబ్బయ్యలతో మాట్లాడారు. పత్తి పంట వేసిన 2 నెలల వరకు సరైన వర్షం పడక పూత దశ పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షం పడి పూత, గూడ రాలి పోయిందని వారు అన్నారు. ఎకరాకు 3 నుండి 4 క్వింటాళ్లు మాత్రమే పత్తి వచ్చిందని, క్వింటా ధర రూ.5 వేలకు అడుగుతున్నారని అంజయ్య ముందు రైతులు వాపోయారు. ఒక ఎకరాకు రైతు ఖర్చు పెట్టింది పశు ఎరువు ట్రాక్టర్ రూ.5 వేలు, ట్రాక్టర్ దుక్కి ఎకరాకు రూ.2200, గొర్రు, గుంటక సేద్యం రూ.3200, విత్తనాల ప్యాకెట్ 800, కలుపు తీయడానికి కూలీలు, రసాయనిక ఎరువులు, పురుగు మందు పిచికారీ, పత్తి తీసే కూలీలు ఎకరాకు సొంత భూమి ఉన్న రైతుకు రూ.32 వేలు, కౌలు రైతులకు రూ.42 వేలు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది దిగుబడి తగ్గుముఖం పట్టిందని క్వింటాకు రూ.8500 గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు తెలిపారని అంజయ్య చెప్పారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు మద్దతు ధర కల్పించాల్సిన అవసరం ఉందని అంజయ్య ప్రభుత్వాలను కోరారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా?



పుల్లలచెరువు రామాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిస్థితి

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని ప్రధాన వీధిలోని రామాలయం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కనీసం భద్రత చర్యలు లేవు. చుట్టూ కంచ, ఇతరత్రా పనులు చేసిన దాఖలాలు లేవు. అక్కడ పచ్చి మొక్కలు ఉండటంతో పశువులు వెళ్లి ప్రమాదం కొని తెచ్చుకునే అవకాశం ఉందని పశుపోషకులు, ప్రజలు పేర్కొంటున్నారు. అక్కడ భద్రత చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పుల్లలచెరువు–వైపాలెం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే పొలంలో స్తంభం పూర్తిగా ఒరిగి ఉంది. పొలాలకు వెళ్లే వారు, ఆ ప్రాంతంలో వాహనాలు వెళ్లేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే భారీ నష్టం సంభవించే అవకాశం లేకపోలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



కవలకుంట్ల పొలాల వద్ద ఒరిగి ఉన్న విద్యుత్ స్తంభం

ఎమ్మెల్యే విరూపాక్షితో వైఎస్సార్ సీపీ నేతల భేటీ



వైఎస్సార్ సీపీ నాయకులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

పెద్దదోర్నాల: కర్నూల్ జిల్లా అలూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి శుక్రవారం మండలానికి చెందిన ఆ పార్టీ ముఖ్య నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. శుక్రవారం ఆయన తాడేపల్లి నుంచి ఆలూరు వెళ్తూ మార్గమధ్యంలోని పెద్దదోర్నాలలో స్థానిక వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన వెలుగొండ ప్రాజెక్టు అతిథి గృహంలో కొద్దిసేపు విశ్రమించారు. అ సందర్భంగా తనకు ఆప్తులైన పలువురు నాయకులతో ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంటక రమణారెడ్డి, చిన్న గుడిపాడు సర్పంచ్ పవన్‌కుమార్, మండల నాయకులు మొద్దు తిరుపతిరావు, మాండ్ల రమణ, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, రావిక్రింది రామారావు, మాండ్ల వెంకటేశ్వర్లు, శ్రీను ఉన్నారు.

సనాతన ధర్మం పేరుతో విషయం పక్కదారి

- సీపీఎం రాష్ట్ర నేత జాలా అంజయ్య



మాట్లాడుతున్న జాలా అంజయ్య

ముండ్లమూరు (దర్శి): సనాతన ధర్మం పేరుతో ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య అన్నారు. మండలంలోని వేంపాడులో సీపీఎం మండల నాలుగో మహాసభలు పంటా ఏడుకొండలు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన జాలా అంజయ్య మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన మెజార్టీ ఇవ్వలేదన్నారు. ఎన్‌డీఏ పక్షాల మద్దతుతో ప్రభుత్వం ఏర్పడినా గత ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందని, కార్పొరేట్ల కోసం జెమిలి ఎన్నికలు అంటూ రాజ్యాంగ ప్రజల స్ఫూర్తిని దెబ్బతీస్తోందన్నారు. సనాతన ధర్మం పేరుతో హిందుత్వ అంజెండాను ప్రజలపై రుద్దుతుందని చెప్పారు. పౌర హక్కులను, ప్రజా ఉద్యమాలను కాలరాసేందుకు చట్టాన్ని తెచ్చి రాజ్యాంగ సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రాంతీయ పార్టీలను బెదిరిస్తూ రాష్ట్రాల హక్కులు బీజేపీ హరిస్తోందన్నారు. టీడీపీ కూటమి ఇచ్చిన హామీల అమలుకు పూనుకోవాలని జాలా అంజయ్య డిమాండ్ చేశారు. మండలంలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, వరి భూములకు సాగర్ జలాలు అందించాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, క్రాప్ ఇన్సూరెన్స్‌లో ఓట్టేజీ సమస్యల పరిష్కారం కోసం సీపీఎం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు తాండవ రంగారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

పెద్దారవీడు: మండలంలో పుచ్చకాయలపల్లి శ్రీ వీరాంజనేయ ట్రేడర్స్, శివశంకర ఏజెన్సీల ఎరువుల దుకాణాలపై మార్కాపురం ఏడీఏ డి. బాలాజీనాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కోరమండల్ కంపెనీ 15:15:15 రకం ఎరువు, 28:29:0 రకం ఎరువు, 10:26:26 రకం ఎరువు, అగ్రో పొటాష్, మెగ్నీషియం మ్యాక్స్ ఎరువులు నిల్వ ఉండాల్సిన కంటే ఎక్కువ నిల్వ ఉన్నట్లు గుర్తించామని, వాటి విలువ రూ.1,65,700 ఉంటుందని, సీల్ చేశామని, ప్రభుత్వ అనుమతి లేనిదే అమ్మరాదని తెలిపారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పురుగు మందులు అమ్మాలని, కాలం చెల్లిన మందులు అమ్మకూడదని, కల్తీ మందులు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. షాపుల యజమానులు షాపు పేరు, స్టాక్ బోర్డు, ధరల పట్టిక లేని వారు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షాపుల్లో ఏ విధమైన ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసినా వాటికి బిల్లు తప్పనిసరిగా దుకాణదారుల నుంచి పొందాలని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో పెద్దారవీడు, తర్లుపాడు వ్యవసాయాధికారులు కె.బుజ్జిబాయి, వెంకటేశ్వర్లు, వీఏఏలు పాల్గొన్నారు.

48 మంది రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



త్రోబాల్ పోటీలు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

దర్శి: జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో 48 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి 4 టీమ్‌లుగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్ క్రీడలను ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలుర, బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో అండర్–14లో ఒక టీం, అండర్–17లో ఒక టీం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా బాలికల విభాగంలో అండర్–14 ఒక టీం, అండర్–17లో ఒక టీం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలు చిత్తూరు జిల్లాలోని పూతలపట్టులో ఈ నెల 28వ తేదీన జరగనున్నట్లు పీడీ సోము అంజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఎంపికై న విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సస్యరక్షణలో ఆధునిక పద్ధతులు పాటించాలి



ఉద్యాన పంటల గురించి వివరిస్తున్న రవి వెంకన్నబాబు

దర్శి: ఉద్యాన పంటల సస్యరక్షణలో ఆధునిక పద్ధతులు పాటించాలని ఉద్యాన వన శాఖ అధికారి ఎం.రవివెంకన్న బాబు సూచించారు. పోతవరం, తిమ్మాయిపాలెం గ్రామాల్లో మామిడి, నిమ్మ, సపోటా, తైవాన్ జామ, మిరప, టమాటా, సంకరజాతి కూరగాయలు దొండ, చిక్కుడు పాదుల పంటలను సందర్శించారు. దళిత రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ అభివృద్ధి పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి వెంకన్న బాబు మాట్లాడుతూ ఉద్యాన పంటల్లో తేనె మంచు పురుగు, ఆకు తినే పురుగుల నివారణకు వాడాల్సిన మందుల గురించి వివరించారు. జామలో పండు ఈగకి లింగాకర్షణ బుట్టలు ఎకరాకు నాలుగు చొప్పున పెట్టాలని సూచించారు. డీబీఆర్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, ఏరియా కో ఆర్డినేటర్ నాగమణి, రైతులు రమణయ్య, చెన్నయ్య, రాజేష్, సుబ్బలమ్మ పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీవ్రం

దర్శి: మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని సీఐ రామారావు, ఎస్సై మురళీ హెచ్చరించారు. మండలంలోని గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిని దర్శి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి శుక్రవారం వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ బెల్ట్ షాపులపై నిత్యం తనిఖీలు చేస్తామని చెప్పారు. ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహించినట్లు తెలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అరెస్టులు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు నిషేధించినట్లు తెలిపారు.



దర్శి: మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

మద్యం అక్రమంగా విక్రయిస్తే చర్యలు

పెద్దారవీడు: గ్రామాల్లో మద్యం అక్రమంగా అమ్మినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.అనీల్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో అక్రమంగా మద్యం విక్రయాన్ని నిర్మూలించేందుకు హనుమాన్ జంక్షన్ కుంటలోని హోటళ్లు, బడ్డీ బంకులను అణువణువునా పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. లైసెన్స్‌డ్ మద్యం షాపుల వారు మాత్రమే మద్యం అమ్మాలని, ప్రైవేట్ వ్యక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం అమ్మకూడదని, కుర్చొని మద్యం సేవించేందుకు ప్రజలకు అవకాశం కల్పించరాదని, అలా కల్పించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం హోటల్స్, బడ్డీ బంకుల యజమానులకు ఎస్ఐ నోటీసులు అందజేశారు.



హోటల్లో తనిఖీ చేస్తున్న ఎస్ఐ అనీల్‌కుమార్

బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

పుల్లలచెరువు: గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సంతప్‌కుమార్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ అధికారుల ఆదేశాలపై గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించరాదని, అలా ఎవరైనా నిర్వహించినట్లుగా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. నాటుసారా కూడా గ్రామాల్లో తయారు చేసినా, అమ్మకాలు జరిపినా తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్సై సంపత్‌కుమార్ హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మల్లికార్జున్‌రావు

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

తాళ్లూరు: పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం అక్రమంగా అమ్ముతున్న దేశిరెడ్డి సుబ్బారెడ్డి అనే యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై మల్లికార్జునరావు తెలిపారు. మండలంలోని తురకపాలెంలో అతని వద్ద ఎనిమిది క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.